# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-05-2025　　　సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ద్వారా 76 ప్రాజెక్టులను ఆమోదించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.
- భూ రికార్డుల నిర్వహణలో లోపాలను సరిదిద్దేందుకు రీసర్వే చేపడుతున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.
- భారత సైన్యానికి సంఘీబావంగా రేపు విజయవాడలో 'భారత్ శౌర్య త్రివర్ణ యాత్ర' నిర్వహించనున్నారు.
- దక్షిణ బంగాళా ఖాతంలోని పలు ప్రాంతాలలో నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ద్వారా 76 ప్రాజెక్టులకు సంబంధించి 4 లక్షల 95 వేల 796 కోట్ల రూపాయల పెట్టుబడులను ఆమోదించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వీటి ద్వారా 4 లక్షల 50 వేల 934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. అమరావతిలోని సచివాలయంలో ఈ రోజు ముఖ్యమంత్రి అధ్యక్షతన 6వ ఎస్.ఐ.పీ.బీ. సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో పరిశ్రమల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలని కోరారు. ఇదిలా ఉండగా ఎనర్జీ, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలలో  పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా, పర్యాటక  రంగంలో హోటళ్లు, గదుల కొరత ఉండటంతో 50 వేల గదులు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందని వెల్లడించారు.

==========================

దేశంలో భూ రికార్డుల నిర్వహణలో లోపాలను సరిదిద్దేందుకు భూముల రీసర్వే చేపడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. గుంటూరులో డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ కార్యక్రమం కింద సర్వే, రీసర్వేపై ఈ రోజు జరిగిన జాతీయ కార్యశాలలో  మంత్రి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూ రికార్డుల వల్ల తలెత్తుతున్న

సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే కేవలం 10 శాతం ఖర్చుతోనే సర్వే పూర్తి చేయవచ్చని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొంటూ..

(వాయిస్ 33 సెకన్లు)

==========================

విజయవాడలో రేపు సాయంత్రం 'భారత్ శౌర్య త్రివర్ణ యాత్ర' నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురంధేశ్వరి, ఎన్డీఏ కూటమి నేతలు ఈ ర్యాలీలో పాల్గొననున్నారు. ఈ త్రివర్ణ యాత్ర విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియం నుంచి ప్రారంభమై బెంజ్ సర్కిల్ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా "ఆపరేషన్ సింధూర్"తో భారత సైనికులు పాకిస్తాన్ లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి దేశ పరిరక్షణకు పాటుపడ్డారు. ఈ నేపథ్యంలో సైనికులకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ దేశ వ్యాప్తంగా ఈనెల 13 నుంచి 23 వరకు 11 రోజుల పాటు భారత్ శౌర్య త్రివర్ణ యాత్ర నిర్వహిస్తోంది. రాష్ట్రంలో కూడా అనేక జిల్లాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ... ప్రజల్లో ఆపరేషన్ సింధూర్ పట్ల అవగాహన కల్పిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రాణాలకు తెగించి సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు అండగా పౌరులు ఉండాలన్న లక్ష్యంతోనే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు.

==========================

అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లాలో ఈ రోజు కృష్ణా-ఏలూరు కాలువపై 5 కోట్ల రూపాయలతో నిర్మించనున్న 4 వరుసల వంతెన నిర్మాణానికి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వంతెన నిర్మాణాన్ని 9 నెలలలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

==========================

నూతన వైఖానస ఆగమ సలహా కమిటీని ఈరోజు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నియమించింది. ఐదు మంది ఆగమ సలహా మండలి సభ్యులను నియమిస్తూ.. టీటీడీ కార్యనిర్వహణాధికారి జె. శ్యామలారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ప్రధాన అర్చక హోదాలో శ్రీకృష్ణ శేషాచల దీక్షితులుతో పాటు వైదిక విశ్వవిద్యాలయం నుంచి నారాయణ చార్యులు, చెన్నైకి చెందిన వరదన్ బట్టాచార్య, గోవింద రాజాస్వామి ఆలయ మాజీ ప్రధాన అర్చకులు అనంత శయన దీక్షితులు, మాజీ శ్రీవారి ఆలయ అర్చకులు ఖాద్రి నరసింహాచార్యులను నియమించారు.

విరామం

==========================

పార్వతీపురం మన్యం జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలలో నిర్దేశించిన లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ప్రాథమిక రంగాల అధికారులను ఆదేశించారు. ప్రతి సంవత్సరం 15 శాతం కంటే ఎక్కువ వృద్ధి రేటు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

==========================

"ఆపరేషన్ సిందూర్" కోట్లాది మంది భారతీయుల మనోభావాలకు ప్రతీక అని శ్రీకాకుళం జిల్లా వాసులు తెలిపారు. పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలను అంతమొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ చేపట్టిందని పేర్కొన్నారు. దీని ద్వారా ప్రపంచానికి భారత సైనిక శక్తిని తెలియచేశామని స్థానికురాలు పైడి సింధూర పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

==========================

వేసవి సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే (SCR) చర్లపల్లి - విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నామని ప్రకటించింది. చర్లపల్లి - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17న శనివారం మధ్యాహ్నం 2 గంటలకు చర్లపల్లి నుండి బయలుదేరి మరుసటి రోజు అంటే 18వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 3 గంటల 35 నిమిషాలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖపట్నం - చర్లపల్లి తిరుగు ప్రయాణంలో అదే రోజు రాత్రి 11 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి 19వ తేదీ ఉదయం 11 గంటల 40 నిమిషాలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్ళు నల్లగొండ, మిరియాలగూడ, నడికుడి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట, అన్నవరం, దువ్వాడ స్టేషన్లలో ఆగుతాయని రైల్వే అధికారులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

==========================

పార్వతీపురం మన్యం జిల్లా  సాలూరులో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు శ్యామలాంబ అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. ఈరోజు సాలూరులో పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... 18వ తేదీన ఉయ్యాల కంబాల, 19న తొలేళ్లు, 20న ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం, 21న అనుపోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

==========================

గడచిన ఆర్థిక సంవత్సరంలో విజయనగరం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లాభాలను ఆర్జించిందని డిసిసిబి పర్సన్ ఇన్ ఛార్జి, సంయుక్త కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ తెలిపారు. ఆయన అధ్యక్షతన బ్యాంకు మహాజనసభను కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు  నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంకును లాభాల బాట వైపు నడిపించిన సహకార సంఘాల సిబ్బందిని, డిసిసిబి సిబ్బందిని అభినందించారు.

==========================

విజయనగరం జిల్లాలోని చంపావతి నదీ పరీవాహక ప్రాంతంలో కార్పొరేట్ సంస్థల నిధులతో 40 చెరువుల పునరుద్ధరణకు ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. యాక్సిస్ బ్యాంకు సి.ఎస్ఆర్ నిధులతో ధాన్ ఫౌండేషన్ ద్వారా ఈ పనులు జరుగుతాయని, ఈ మేరకు జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదన వచ్చిందని తెలిపారు.

==========================

దక్షిణ బంగాళా ఖాతంలోని పలు ప్రాంతాలలో నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అనేక జిల్లాలలో తేలిక పాటి నుండి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి తెలియచేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

==========================
==========================